క్లుప్తంగా

సాదిఖ్ అలీ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్‌జోన్: టీఎన్జీఓ సంఘానికి సాదిఖ్ అలీ చేసిన సేవలు చిరస్మరణీయమని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో సాదిఖ్ అలీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాట్లాడుతూ.. జిల్లా సహకార శాఖకు విశిష్టమైన సేవలు అందించి అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బట్టి రమేష్, ఉపాధ్యక్షుడు మంగ మనోహర్, ఎండీ. ఫజలుద్దీన్, మెదక్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పంపరి శివాజీ, ఆరేళ్ల రామాగౌడ్, రఘునాథరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్ హేయమైన చర్య



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్ హేయమైన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. గురువారం పేటలో విలేకరులతో మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధిచెబుతారని అన్నారు. తెలంగాణతో పాటు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ఓటరు జాబితాపై గురువారం బీఎల్‌ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ మందిరంలో బీఎల్‌ఓలకు పలు అంశాలపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌చారి మాట్లాడుతూ.. కొత్త ఓటరు నమోదుతో పాటు ఓటరు లిస్టులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాదిక్, ఆర్‌ఐ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ సబిత

రామాయంపేట(మెదక్): హాస్టళ్లలో చదువుతున్న పిల్లల ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నార్సింగి ఎంపీపీ చిందం సబిత సూచించారు. గురువారం ఆమె నార్సింగిలోని బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. హాస్టల్ భవనంలోని ఒక గదిలో నీరు ఉరుస్తుండడంతో విద్యార్థులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్ భవనంలో రెండు గదులను పశు సంవర్ధకశాఖ వారు వినియోగించుకుంటుండగా, ఒక గదిని విద్యార్థులను అప్పగించాలని ఎంపీపీ సూచించారు. ఆమె వెంట హాస్టల్ సంక్షేమాధికారిణి సుజాత ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

చేగుంట(తూప్రాన్)/వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట తహసీల్దార్‌గా గురువారం చరణ్‌సింగ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. నిజాంపేట మండలం నుంచి ఆయన బదిలీపై రాగా మాసాయిపేట తహసీల్దార్‌గా పనిచేసిన మాలతి తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా బదిలీ అయ్యారు. అలాగే చేగుంట తహసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

శిథిలం.. భయం భయం

శిథిలావస్థలో రామాయంపేట తహసీల్దార్ కార్యాలయం

- వర్షాలతో ఆందోళనలో సిబ్బంది



శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



గదిలో వర్షం నీరు పడకుండ అడ్డుగా గిన్నెల ఏర్పాటు

రామాయంపేట(మెదక్): రామాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో పూర్తిగా శిథిలమైన భవనంలోని అన్ని గదుల్లో నీరు ఉరుస్తూ ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే చాలా వరకు రికార్డులు తడిసిపోగా.. గదుల్లో ఉరుస్తున్న వర్షానికి అడ్డుగా గిన్నెలు ఏర్పాటు చేశారు. పూర్తిగా శిథిలమైన ఆ భవనంలోకి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. అధికారులు, సిబ్బంది సైతం భయం, భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త భవన నిర్మాణానికి ఆరేళ్ల క్రితమే శంకుస్థాపన చేయగా.. పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

అసంపూర్తిగా కొత్త భవన నిర్మాణం

రామాయంపేట తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి 1981లో అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య శంకుస్థాపన చేశారు. ఆసమయంలో భవనాన్ని నాణ్యతగా నిర్మించకపోవడంతో అనతికాలంలోనే శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పైభాగం దెబ్బతినడంతో పాటు చిన్నపాటి చినుకులు పడినా వర్షం ధారగా కురుస్తోంది. గోడలు బీటలు వారడంతో పాటు స్లాబ్ కింది భాగం పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సిబ్బంది భయాందోళన మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త భవనం నిర్మాణానికి సంబంధించి రూ. 3.42 కోట్లు మంజూరు కాగా, సంబంధిత కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు నిలిపివేశారు. దీంతో భవన నిర్మాణం కేవలం స్లాబ్‌కే పరిమితమైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకొని కొత్త భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దెబ్బతిన్న స్లాబ్ పైభాగం

అధికారులకు నివేదించాం



కొత్త భవన నిర్మాణ పనులు ఆరేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. పాత భవనం పాక్షికంగా శిథిలమవడంతో పాటు నీరు ఉరుస్తోంది. ప్రమాదకరంగా మారిన ఈ భవనంలో విధులు నిర్వర్తించాలంటే సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఇదే విషయమై మెదక్ ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. – అబ్దుల్ మన్నాన్, తహసీల్దార్, రామాయంపేట

సొంత నిధులతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న లావణ్య మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పనులు చేస్తున్నప్పటికీ కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు (సాక్షి కాదు) రాయడంపై మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య మదన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అన్యాక్రాంతం అవుతున్న 10 ఎకరాల 9 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పల్లె ప్రకృతి వనానికి కేటాయించినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కానప్పటికీ రెండు రూ. లక్షల 30 వేల సొంత నిధులతో పిచ్చిమొక్కల తొలగింపుతో పాటు భూమి చదును చేసి మొక్కల పెంపకం చేపడుతున్నట్టు చెప్పారు. తప్పుడు రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి



అల్లాదుర్గం(మెదక్): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలతో శిథిలమైన ఇళ్లలో ఉండకూడదన్నారు. కరెంట్ స్తంభాలు ముట్టుకోవద్దని.. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

అందుబాటులో లేని వైద్యులు



పీహెచ్‌సీలో వైద్యులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ అందుబాటులో ఉండాల్సిన వైద్యులు విధులకు గైర్హాజరయ్యారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం వైద్యులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. స్టాఫ్ నర్స్, ఇద్దరు సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. చేసేది లేక ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లామని ప్రజలు చెప్పారు. అంతేకాకుండా గ్రామాల్లోని సబ్ సెంటర్లలో సైతం వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై వైద్యులు జ్యోత్స్నాదేవిని వివరణ కోరగా వర్షం అధికంగా ఉండడంతో గురువారం విధులకు హాజరు కాలేకపోయానని తెలిపారు.

టమాట కిలో రూ. 200

కౌడిపల్లి(నర్సాపూర్): టమాట ధర ఆకాశాన్నంటింది. మండలకేంద్రమైన కౌడిపల్లిలో గురువారం జరిగిన సంతలో కిలో టమాట రూ. 200 ధర పలికింది. మూడు రోజులుగా వర్షం కురుస్తుండడం.. అమ్మకానికి వ్యాపారస్తులు ఎక్కువగా రాకపోవడంతో డిమాండ్ మరింత పెరిగింది. మిగితా కూరగాయలు బెండ, దొండ, చిక్కుడు, కాకర కిలో రూ. 80 పలికింది.

సీఎం దిష్టిబొమ్మ దహనం

రామాయంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా గురువారం సాయంత్రం ఆపార్టీ కార్యకర్తలు రామాయంపేటలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట గ్రామ శివారులోని నోవాల్టెక్ పరిశ్రమ ఎదుట మహిళా కార్మికులు ఆందోళన చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పరిశ్రమ ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిశ్రమలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సింది పోయి తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై తాము అభ్యంతరం తెలిపినా పట్టించుకోవడంలేదన్నారు. గతంలో మాదిరిగా పరిశ్రమలో తమను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు సంఘీభావంగా మాజీ సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు, పవన్, తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో యువతే కీలకం



క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): సమాజాభివృద్ధికి యువత సహకారం అవసరమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం పోతనశక్తిపల్లి చౌరస్తాలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కొల్చారం మండలం కోనాపూర్‌కు చెందిన యువజన నాయకుడు సంతోష్‌రావు సౌజన్యంతో మండలంలోని క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రంగౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ యాదగౌడ్, యువజన నాయకులు వెంకట్‌గౌడ్, రవితేజరెడ్డి, ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన నిర్మాణాలకు నిధులు

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ముదిరాజ్ భవన నిర్మాణాలకు రూ. 20 లక్షల నిధులు అందిస్తున్నట్టు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మిర్జాపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నశంకరంపేట ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి రూ. 10 లక్షల మిర్జాపల్లి ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు, శేరిపల్లి గ్రామ ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ఈసందర్భంగా నిధుల ప్రొసీడింగ్ కాపీలను అందించారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట, మిర్జాపల్లి, శేరిపల్లి ముదిరాజ్ సంఘం నాయకులు, సర్పంచ్ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, జెడ్పీటీసీ మాధవి, మాజీ ఎంపీపీ కృపావతి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మిర్జాపల్లిలో నల్ల పోచమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని బోనం ఎత్తుకున్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



తూప్రాన్: వర్షంలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



మనోహరాబాద్: రోడ్డుపై వరి నాట్లు వేస్తున్న కార్మికులు

పెద్దశంకరంపేట(మెదక్): తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. గురువారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట వర్షంలోనూ పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. కార్యక్రమంలో కార్మికులు మురళి, ప్రవీణ్, మల్లేశం, బత్తుల రాములు, తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పంచాయతీ కార్మికులు వినూత్నంగా రోడ్డుపైనే నాట్లు వేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్మిక ఉపాధ్యక్షుడు ఆసిఫ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వాన హోరు.. వరద జోరు

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. కొన్నిచోట్ల వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జనం ఇళ్లకే పరిమితం కాగా వరద నీటిలో కొట్టుకొచ్చిన చేపలు పట్టేందుకు కొందరు ఎగబడ్డారు.



పెద్దశంకరంపేట: బూర్గుపల్లి శివారులో వరి నాట్లు వేస్తున్న కూలీలు



టేక్మాల్: జోగిపేట- ఎలకుర్తి రోడ్డుపై పారుతున్న వరద నీరు



చిన్నశంకరంపేట: అలుగు పారుతున్న భాగీరథపల్లి చెరువు



శివ్వంపేటలో పంట పొలంలోకి చేరిన నీరు



మెదక్ మున్సిపాలిటీ: ఎంఎన్ కెనాల్ వరద ప్రవాహం



నర్సాపూర్: విఘ్నేశ్వర కాలనీలో నిలిచిన వర్షం నీరు

పాత ఇళ్లలో ఉండొద్దు

మనోహరాబాద్(తూప్రాన్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాత ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, అందులో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని ఎంపీఓ లక్ష్మీనర్సయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలో కార్యదర్శి రూపగౌడ్‌తో కలిసి పురాతన ఇళ్లను పరిశీలించి సూచనలు చేశారు.

పంటలు కాపాడుకోండి

నిజాంపేట(మెదక్): వర్షాలతో పంట పొలాలు నీట మునగడంతో వాటిని కాపాడుకోవడానికి మండల వ్యవసాయ అధికారి సతీష్ పేర్కొన్నారు. ఈమేరకు గురువారం వరి, మొక్కజొన్న, పత్తి మొక్కల మధ్య నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అధిక వర్షాలతో పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం మొక్క వయసును బట్టి 10గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటకు రెవెన్యూ డివిజన్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు గురువారం నాటికి 116 రోజులకు చేరుకున్నాయి. భారీ వర్షాన్ని సైతం లెక్కజేయకుండా దీక్ష కొనసాగించారు.

'అరెస్టులకు భయపడేదిలేదు'

కౌడిపల్లి(నర్సాపూర్): డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెళితే అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీజేపీ మండల ఇన్‌చార్జి, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ గోడ రాజేందర్ విమర్శించారు. గురువారం కౌడిపల్లిలో విలేకరులతో మాట్లాడారు. నిరసనలు తెలపడం, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం ప్రతిపక్షాల బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజీపేట రాజేందర్, మండలపార్టీ అధ్యక్షుడు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.